

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

## బాలికల చదువుతోనే సమాజంలో మార్పు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిట్యాల, జూలై 8 : బాలికల చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని, పురుషులకు సమానంగా స్త్రీలు చదువుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుండ్రాంపల్లిలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను, మహిళలను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారికి తగిన సౌకర్యాలను కల్పించాలని మంత్రి సూచించారు. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నల్లగొండ జిల్లాలో శిక్షణ పొందిన ట్రాన్స్‌జెండర్లకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ 2. లక్షల ఆర్థిక సాయం అందించారు. వారికి పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను అప్పగిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని 110 మంది ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ ఇచ్చినట్లు, వారికి స్వయం ఉపాధి కల్పించటం కోసం వడ్డీలేని రుణాలు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ సీ.నారాయణరెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సక్కుబాయి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఎంపీడీఓ ఎస్పీ జయలక్ష్మి, ఎస్పీజీ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- మండల కేంద్రాల్లో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఉదయం 10.40 గంటలకు నల్లగొండలో ప్రజావాణి పరిస్థితి

చందంపేట, జూలై 8 : మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మి తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన ప్రజావాణిలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దరఖాస్తులు అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 568 దరఖాస్తులు వచ్చాయి. చందంపేట మండలంలో 220, నేరేడుగొమ్ము మండలంలో 18, చింతపల్లిలో 91, డిండిలో 51, పీఏపల్లిలో 139,

### నకిరేకల్ నియోజకవర్గంలో 101 దరఖాస్తులు

కట్టంగూర్ : నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కార్యక్రమంలో ప్రజల నుంచి 101 దరఖాస్తులను వచ్చినట్లు అధికారులు తెలిపారు. నకిరేకల్‌లో 54, నార్కట్‌పల్లిలో 9, కట్టంగూర్‌లో 5, కేతేపల్లిలో 11, చిట్యాలలో 22 దరఖాస్తులు వచ్చినట్లు ఆయా మండలాల అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఎంపీడీఓలు పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, చంద్రశేఖర్, ఉమేశ్, జయలక్ష్మి, తాసీల్దార్లు గుగులోతు ప్రసాద్, జమీరుద్దీన్, కృష్ణ పాల్గొన్నారు.

హాలియా : ప్రజావాణిలో అనుముల మండలంలో 8, త్రిపురారంలో 52, నిడమనూరులో 25, పెద్దవూరలో 10, తిరుమలగిరి సాగర్‌లో 69, గుర్రంపోడు మండలంలో 28 దరఖాస్తులు వచ్చాయి. అనుముల మండలంలో 8 దరఖాస్తుల్లో 4 మాత్రమే అధికారులు మండల స్థాయిలో పరిష్కరించారు. మరో 4 రెవెన్యూ దరఖాస్తులను తాసీల్దార్‌కు బదిలీ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీఓలు, తాసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పంచాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్రిగూడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య తెలిపారు. తాసీల్దార్ బక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సమయానికి రాని అధికారులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు సమయానికి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజావాణి ఉదయం 10 గంటలకే ప్రారంభం కావాల్సి ఉన్నా 10:40గంటల వరకు కూడా ఎంపీడీఓ, తాసీల్దార్, ఎంపీఓ, ఏపీఎం, ఏపీఓతో పాటు 8 మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రమే వచ్చారు. తరువాత ఒక్కొక్కరుగా వచ్చి ఫోన్ మాట్లాడుతూ బయట తిరిగారు. ప్రజావాణి మొక్కుబడిగా జరిపితే తమ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని అక్కడికి వచ్చిన ప్రజలు చెప్పుకోవడం కనిపించింది.

### అధికారులు డుమ్మా.. ప్రజల అనాసక్తి



ప్రజావాణిలో పాల్గొన్న ముగ్గురు అధికారులు

పెద్దవూర: జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నా సగం మంది కూడా రాక పోవడంతో ప్రజల్లో ఆసక్తి తగ్గిపోతున్నది. సోమవారం పెద్దవూర మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో ఉదయం కార్యక్రమం మొదలు కాగనే 13 మంది అధికారులు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లారు. కేవలం ఇన్‌చార్జి ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శి, తాసీల్దార్ కార్యాలయ అధికారి ఒకరు మాత్రమే ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అయితే తమ సమస్య చెప్పుకునేందుకు వస్తే.. సదరు అధికారే లేక పోవడంతో ప్రజలు కూడా దరఖాస్తులు ఇచ్చేందుకు ఆసక్తి కనబర్చలేదు. తమ సమస్యలన్నీ మండల, గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని జిల్లా అధికారులు చెబుతున్నా.. మండల స్థాయిలో తమ అర్జీలపై స్పందించే అధికారులే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## సమయ పాలన పాటించని ఉద్యోగులపై చర్యలు

- ఎమ్మెల్యే బీఎల్ఆర్



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూలై 8 : సమయ పాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని, మున్సిపల్ ఉద్యోగులందరూ డ్రెస్‌కోడ్ పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమయపాలన లేకపోయినా, ప్రజల సమస్యలపై సక్రమంగా స్పందించకపోయినా తక్షణమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి బదిలీ చేయిస్తానని హెచ్చరించారు. అనంతరం మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డును ఎమ్మెల్యే సందర్శించారు. సమయానికి ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, సిబ్బంది ఉన్నారు.

## శాలిగౌరారం ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు



మాట్లాడుతున్న బెల్లి నిఖిత

నల్లగొండ రూరల్, జూలై 8: తనతో అసభ్యకరంగా ప్రవర్తించిన శాలిగౌరారం ఎస్ఐ వాసా ప్రవీణ్‌పై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన బెల్లి నిఖిత సోమవారం ఎస్పీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతనెల 24న ఈ విషయమై ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. దాంతో సదరు ఎస్ఐ తనకు విరుద్ధంగా కొన్ని సంఘాలతో ప్రెస్‌మీట్ పెట్టించి తనను మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అతడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గతంలో డీజీపీకి చేసిన ఫిర్యాదు కాపీని కూడా ఎస్పీకి అందించినట్లు ఆమె పేర్కొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పర్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నిడమనూరు, జూలై 8 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పర్చి, ప్రజా పోరాటాలకు సిద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో సోమవారం జరిగిన సీపీఎం నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, అందుకు రాజకీయ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అంతకు ముందు సీనియర్ నాయకుడు కత్తి లింగారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి వివిధ అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ, మర్రి శంకర్, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్, దైద శ్రీను, దుబ్బ రామచంద్రయ్య, ఆకారపు నరేశ్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు దైద జానకమ్మ, ఎస్‌కే. బషీర్, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో నాగరాజుగౌడ్



మాజీ ఎమ్మెల్యే కిశోర్‌తో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు నాగరాజుగౌడ్

శాలిగౌరారం, జూలై 8 : ప్రజాసేవలో అందరికంటే ముందుంటున్నారు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని తాను ప్రజాసేవ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండంలోని పలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తూ, పేదలకు సేవ చేస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. యువతను రాజకీయంగా చైతన్య పరుస్తూ వారిని సంఘటితం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ అడుగుజాడల్లో నడుస్తూ సేవా కార్యక్రమాలతో పాటు బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తాన్నారు.

## అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో నకిరేకల్ వాసి ప్రతిభ



జాని

నకిరేకల్, జూలై 8 : షాహిద్ భగత్ సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లో ఈ నెల 4 నుంచి 7 వరకు జరిగిన ఇండోనేపాల్ ఇంటర్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో నకిరేకల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతిభ కనబర్చి భారతజట్టును గెలిపించడంలో కీలకపాత్ర పోషించాడు. పట్టణంలోని చీమలగడ్డకు చెందిన పగిడిమర్రి జాని నకిరేకల్ పట్టణంలోని నారాయణ స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన టోర్నమెంట్‌లో భారత్ జట్టు తరపున ఆడారు. ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో నేపాల్‌పై భారత్ జట్టు విజయం సాధించింది. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చిన జాని బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

## అధిక వడ్డీ పేరుతో ఘరానా మోసం

- రూ.50 కోట్లు వసూలు చేసి ఉడాయించిన తండ్రీకొడుకులు
- పట్టుకొని పోలీసులకు అప్పగించిన బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మాల్, జూలై 8: తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని చెప్పి ప్రజల నుంచి సుమారు రూ. 50కోట్ల వరకు వసూలు చేసి మోసగించిన ఇద్దరిని సోమవారం బాధితులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. చింతపల్లి మండలంలోని గొడకొండ్లకు చెందిన మదిని మనీశ్‌రెడ్డి, అతడి తండ్రి సంజయ్‌రెడ్డి నాలుగేండ్లుగా అధిక వడ్డీ పేరుతో ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నారు. వంద రూపాయలు పెడితే రెండో నెలలో వారికి రెండు వందలు చెల్లించి ప్రజల నమ్మకాన్ని పొందారు. ఇలా క్రమంగా తమ వ్యాపారాన్ని పెంచుకుంటూ సుమారు 40 మంది ఏజెంట్లను నియమించుకొని మరీ చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి మండలాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని మాడ్గుల్ మండలాల్లో ప్రజల నుంచి సుమారు రూ. 50 కోట్లు వసూలు చేశారు. ఏడు నెలలుగా కనిపించకుండా పోయారు. దాంతో బాధితులు వారి కోసం ఎదురు చూస్తున్నారు. ఆదివారం వారి ఆచూకీ తెలుసుకొని పట్టుకొని తమ డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. తమ డబ్బులు ఇచ్చే వరకు వదిలేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్ఐ యాదయ్య నచ్చజెప్పడంతో బాధితులు శాంతించారు.

## రూ.కోటిన్నరతో ఉడాయించిన వడ్డీ వ్యాపారి

- న్యాయం చేయాలని మంత్రికి బాధితుల వేడుకోలు

నల్లగొండ/మాడ్గులపల్లి, జూలై 8 : వడ్డీ ఆశ చూపి కూలీలు దాచుకున్న డబ్బులతో ఉడాయించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాడ్గులపల్లికి చెందిన బాధితులు సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. మిర్యాలగూడలో నివాసముండే దాచేపల్లి గోవర్ధన్ మాడ్గులపల్లి మండలానికి చెందిన 150 మంది వద్ద రూ.1.50 కోట్లు తీసుకున్నాడని.. తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని బాధితులు మంత్రికి నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. వడ్డీ వ్యాపారి నుంచి తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే స్పందించి జిల్లా ఎస్పీ, మిర్యాలగూడ డీఎస్పీతో ఫోన్లో మాట్లాడారు.డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న గోవర్ధనను వెంటనే అరెస్ట్ చేసి అతడి ఆస్తులను సీజ్ చేయాలని సూచించారు.

## 21న ఆషాఢమాస బోనాలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూలై 8 : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు సంతోశ్ నగర్‌లోని కాళికా మాత ఆలయంలో ఆషాఢమాస బోనాలను ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఎల్లపురెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. బోనాల పండుగకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ సలహాదారులు కందాల లక్ష్మీనారాయణరెడ్డి, గర్రె మురళి, ప్రధాన కార్యదర్శి గోగికార్ పరమేశ్, ఉపాధ్యక్షుడు చెంచల యాదగిరి, పగిళ్ల వెంకన్న, ఏశబోయిన యాదయ్య, మేకల దేవయ్య, బచ్చు శ్రీనివాస్, కోశాధికారి లగిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పలువురు సీఐల బదిలీ

నల్లగొండ రూరల్, జూలై 8: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ -2 ఐజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీలో వెయిటింగ్‌లో ఉన్న కొండల్‌రెడ్డిని శాలిగౌరారానికి, నల్లగొండలో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని ఐజీ కార్యాలయానికి , నల్లగొండ వన్‌టౌన్ సీఐ సత్యనారయణను సంగారెడ్డి వీఆర్‌కు, ఇంటలిజెన్స్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డిని నల్లగొండ వన్‌టౌన్‌కు, హైదరాబాద్ సిటీ వెయిటింగ్‌లో ఉన్న క్రాంతికుమార్‌ను నల్లగొండ ట్రాఫిక్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పలువురు సీఐలు సోమవారం బాధ్యతలు స్వీరించారు.

### శాలిగౌరారం సీఐగా కొండల్‌రెడ్డి

శాలిగౌరారం, జూలై 8 : శాలిగౌరారం సీఐగా కొండల్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు శాలిగౌరారం సీఐగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కొండల్‌రెడ్డిని నియమించారు.

### మూసీ కాల్వకు నీటివిడుదల తేదీలు ప్రకటించాలి

కేతేపల్లి, జూలై 8 : మూసీ కుడి, ఎడమ కాల్వల పరిధిలో సాగునీటి విడుదల తేదీలను ప్రభుత్వం ప్రకటించాలని కేతేపల్లి మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జున్‌రావు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో వరినార్లు పోసుకునే రైతులు ప్రభుత్వం నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించక పోవడంతో అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 638 అడుగుల వరకు నీటి మట్టం ఉన్నందున జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆయకట్టు రైతుల ప్రయోజనాల కోసం త్వరగా నీటి విడుదల తేదీలు ప్రకటించాలని కోరారు.

### సీఐ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి : జానయ్య

నిడమనూరు, జూలై 8 : దళిత ఎస్ఐ మృతికి కారకులైన అశ్వారావు పేట సీఐ జితేందర్‌రెడ్డి, ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు కామర్ల జానయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమనూరు మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కుల అహంకారానికి, అవమానానికి గురైనందునే దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. శ్రీనివాస్ కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు.

## నాసిరకం మొక్కలు అందించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు రైతుల వినతి**



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

నల్లగొండ, జూలై 8 : బత్తాయి తోట సాగు చేసి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సురుగురు శ్రీనివాస్‌రెడ్డితో పాటు సుమారు 70 మంది రైతులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి యూనివర్సిటీ వారు జిల్లాలోని రైతులకు నాసిరకం మొక్కలను అందజేశారని ఆరోపించారు. వాటిని నాటిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. ఈ విషయమై జయశంకర్ హార్టికల్చర్ యూనివర్సిటీ లేదా నేషనల్ సిట్రస్ రీసెర్చ్ స్టేషన్ నాగపూర్ శాస్త్రవేత్తలతో కమిటీ వేసి తోటలను పరిశీలించి, డీఎన్ఏ పరీక్షలు చేసి యూనివర్సిటీ పై తగు చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాము బత్తాయి సాగు చేసి 10 సంవత్సరాలు గడిచినా కూడా రంగాపూర్ (సాద్గుడి) రకం వేసిన రైతులకు ఎలాంటి దిగుబడి రాకపోవడం శోచనీయమన్నారు. అలాగే ఆ మొక్కల నుండి వచ్చిన దిగుబడి కూడా నాసిరకంగా ఉంటుందని ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర తక్షణమే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని హార్టికల్చర్ అధికారి సంగీతలక్ష్మిని ఆదేశించారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు దేవిరెడ్డి నారాయణరెడ్డి, జొన్నలగడ్డ ఉపేందర్‌రెడ్డి, సిరిగిరి శ్రీనివాస్ రెడ్డి, జూలకంటి శేఖర్‌రెడ్డి, ఎర్రమాద శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరి రవీందర్‌రెడ్డి, ముదిరెడ్డి రాఘవరెడ్డి ఉన్నారు.

## రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని వీఆర్వోల వినతి

నల్లగొండ, జూలై 8: గ్రామ రెవెన్యూ వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖలో తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


### ఆర్టీసీ డిపో అధికారుల బదిలీ

నల్లగొండ రూరల్,జూలై 8: పలువురు ఆర్టీసీ అధికారులు బదిలీ అయ్యారు. నల్లగొండ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న రామ్మోహన్‌రెడ్డిని మిర్యాలగూడకు, మిర్యాలగూడ డీఎం పాల్‌ను నిజామాబాద్‌కు, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ డీఎం శ్రీనాథ్‌తో పాటు దేవరకొండకు డీఎం రమేశ్‌ను బదిలీ చేస్తూ ఆర్టీసీ అధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆర్థిక సాయం

త్రిపురారం, జూలై 8: మండల కేంద్రానికి చెందిన తెలకపల్లి సైదులు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బచ్చలకూరి వెంకన్న, నాగిరి శ్రీను, రమేశ్, కమల్‌హాసన్ ఉన్నారు.

## మాజీ జడ్పీటీసీ సురేందర్‌రెడ్డికి సన్మానం



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీలు

మర్రిగూడ, జూలై 8 : మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఐదేండ్ల పదవీకాలం ముగియడంతో సోమవారం మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శిలువేరు విష్ణు, నేనావత్ బంతిలాల్, మాజీ సర్పంచులు నల్ల యాదయ్య, స్వాతీనవీన్‌రెడ్డి, నున్సావత్ సక్కుబాయిబిచ్చునాయక్, శాంతమ్మావెంకటయ్య, పాక నగేశ్, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ప్రముఖ హోటల్‌లో చిట్యాల మరియు చౌటుప్పల్ నందు పని చేయుటకు వెలకమ్ గర్ల్స్, సర్వీస్ గర్ల్స్ మరియు హెల్పర్స్ వెంటనే కావలెను. సంప్ర: 7675910480.
NT-325870

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

**షీటీమ్ ఏఎస్ఐ సబిత**



మాట్లాడుతున్న షీటీం ఎస్ఐ సబిత


మిర్యాలగూడ, జూలై8 : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఏఎస్ఐ సబిత అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మారిన చట్టాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే, ఆడపిల్లలను అవమానిస్తే, వారి స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సుజయ్‌కుమార్, డైరెక్టర్ జయరాజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి : సీపీఎం

మునుగోడు, జూలై 8 : కౌలు రైతులకు కూడా రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కల్వలపల్లి, గూడపూర్, కొరటికల్ గ్రామాల్లో కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సాగర్ల మల్లేశ్, శివర్ల వీరమల్లు, ఒంటిపాక అయోధ్య, అనిల్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, మదార్, సైదులు పాల్గొన్నారు.

## ప్రజా నమ్మకాలను వమ్ము చేయకుండా పాలన అందించాలి

**సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

రామగిరి,జూలై 8: తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం శుభపరిణామమని, సమస్యల పరిష్కారం కోసం వేసిన కమిటీలతో శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల నమ్మకాలను వమ్ము చేయకుండా ప్రజా పాలన అందించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టాలను త్వరగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఆరు గ్యారంటీలతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. వాటిలో కొన్ని హామీలు అమలు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో హామీలు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లను మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయాడానికి వేలం వేయాలని చూస్తుందన్నారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నల్ప రాజు రామలింగయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి సినియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు,మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,బంటు వెంకటేశ్వర్లు,బొడ్డుపల్లి వెంకటరమణ,ఆర్ అంజాచారి, రామచంద్రం పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి, జూలై 8 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్థానిక చౌరస్తా వద్ద సోమవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. పెద్దఅడిశర్లపల్లి మండంలోని వద్దిపట్లకు చెందిన రమావత్ ముని, రమావత్ రాజశేఖర్ బొలేరో వాహనంలో 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పలుగుతండా నుంచి అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.